సాక్షి అనకాపల్లి

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



రసవత్తరంగా నృత్యరూపకం

విశాఖ నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం నయనానందకరం సాగింది.



వెంకన్నకు పుష్పాభిషేకం

గాజువాక (విశాఖ): ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామివారికి సామూహిక లక్ష తులసి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు.



తీరం కోత తీవ్రతరం

విశాఖ: సముద్ర తీరంలో కోత తీవ్రమవుతోంది. తాజాగా బీచ్‌రోడ్డులో పలు కొబ్బరి చెట్లు భారీ కెరటాల తీవ్రతకు నేలకూలాయి.

న్యూస్‌రీల్

గంజాయి స్మగ్లర్ల నుంచి ఆస్తులు కొనడం నేరం

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



సాక్షి, అనకాపల్లి: గంజాయి కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ముద్దాయిలు, గంజాయి స్మగ్లర్ల నుంచి ఆస్తులు కొనుగోలు చేయకూడదని, అలా చేస్తే నేరంగా పరిగణిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేస్తూ.. అలా కొనుగోలు చేసిన ఆస్తులను జప్తు చేయడంతోపాటు కొన్నవారిని కూడా నేరస్తులుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావుకు ఈ ఏడాది నవంబర్ 12వ తేదీన పదేళ్లపాటు జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చిన విషయం గుర్తు చేశారు. అనేక సంవత్సరాలుగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న పడాల నాగేశ్వరరావు..తన భార్య పేరు మీద 15.36 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడన్నారు. పోలీసులు జరిపిన ఆర్థిక విచారణలో గంజాయి రవాణా ద్వారా వచ్చిన ఆదాయమని తేలిందన్నారు. అక్రమంగా సంపాదించిన ఈ ఆస్తులను కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు సందర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ ఇటీవల స్టాండింగ్ కమిటీ సమావేశంలో అడిగిన ప్రశ్నలకు సంబంధించి డీఈవో హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలు పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులు కూడా ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న టాయ్‌లెట్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పీఎంసీ వైస్ చైర్మన్ బొడ్డేడ మహేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాల వద్ద జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తదితరులు

జన హృదయనేత.. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లా అంతటా వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానుల ఆధ్వర్యంలో రక్తదానాలు, అన్నదానాలు, దుప్పట్ల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు బర్త్‌డే కేక్‌లు కట్ చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని మనసారా ఆశీర్వదించారు.



నర్సీపట్నంలో రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తనయుడు విజయ్ అవినాష్

జనాభిమానం..

సేవా సంబరం

పండగలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు
- అనాథాశ్రమంలో చిన్నారులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

సాక్షి, అనకాపల్లి:

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్‌లు, మిఠాయిల పంపిణీతోపాటు జిల్లాలో ఊరూరా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు రక్తదానం చేశారు. వాటితోపాటుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. దివ్యాంగులకు, వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనకాపల్లి టౌన్‌లో గల స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీ బీవీ సత్యవతి, సమన్వయకర్త భరత్‌కుమార్‌లు పాల్గొని కేక్ కట్ చేశారు. నెహ్రూచౌక్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో 1000 మంది నిరుపేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

పార్టీలకు అతీతంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం మాడుగుల మండలం ఘాట్ రోడ్ జంక్షన్‌లో నిర్వహించిన మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పాలన అందజేసిన ఏకైక నాయకుడన్నారు. ప్రజలకు ఇప్పుడిప్పుడే వాస్తవాలు అర్థమవుతున్నాయని, వైఎస్ జగన్ అందజేసిన సంక్షేమ పథకాలే తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు మాడుగుల ఆర్‌సీఎం వృద్ధాశ్రమంలో వృద్ధులకు, స్థానిక ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రిలో రోగులకు పాలు రొట్టెలు, పండ్లు అందజేశారు. అనంతరం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో మోదకొండమ్మ పాదాలు వద్ద జగన్‌మోహన్‌రెడ్డి పది కాలాలపాటు ఆరోగ్యంగా ఉండాలని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ముందుగా మండలం నలు మూలల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన అశేష పార్టీ శ్రేణుల నడుమ భారీ కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు.

- పాయకరావుపేట మండలంలో శ్రీరాంపురం గ్రామంలో మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో సమన్వయకర్త కంబాల జోగులు పాల్గొన్నారు. కోటవురట్లలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్ సీతారామరాజు(దత్తుడుబాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో సమన్వయకర్త కంబాల జోగులు పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో సమన్వయకర్త పాల్గొన్నారు. నక్కపల్లి మండలంలో పార్టీ కార్యాలయంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో, పారిపల్లిపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో సమన్వయకర్త కంబాల జోగులు పాల్గొన్నారు.
- అచ్యుతాపురంలో పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త యూవీ రమణమూర్తి రాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజక వర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్‌ఏ కన్నబాబు రాజు కేక్ కట్ చేశారు. మోసయ్యపేటలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమంలో అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుడైన ఎనిమిదవ తరగతి విద్యార్థి దుర్గా ప్రసాద్‌కు మాజీ ఎంఎల్‌ఏ కన్నబాబు చేతుల మీదుగా ట్రై సైకిల్ అందజేశారు.
- మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో చోడవరం కార్యాలయంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. గాంధీగ్రామంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం, గోవాడ శివాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేరున ప్రత్యేక పూజాకార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. రావికమతం మండలంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో నర్సీపట్నం టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిగాయి. అనంతరం రక్తదానం చేశారు. నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చోడవరం గాంధీగ్రామంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ధర్మశ్రీ



అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త మలసాల, డా.సత్యవతి



ఎస్.రాయవరం: అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



మోసయ్యపేటలో దివ్యాంగ విద్యార్థి దుర్గాప్రసాద్‌కు ట్రై సైకిల్ అందజేస్తున్న కన్నబాబు రాజు



కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లో దివ్యాంగ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్

ప్రశాంతంగా టీచర్ల ప్రమోషన్ల కౌన్సెలింగ్



ఉత్తర్వులు అందజేస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్

విశాఖ విద్య: మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన ప్రమోషన్ల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. డీఈవో కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు జీవీఎంసీ పరిధిలోని విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొత్తం 34 పోస్టుల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించగా.. అర్హతల మేరకు 23 మందికి ప్రమోషన్లు కల్పించినట్లు డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. అనంతరం ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందజేశారు.

60 రోజుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం

అనకాపల్లి (కశింకోట) : విద్యుత్ సమస్యలపై వినియోగదారులు చేసే ఫిర్యాదులను 60 రోజుల వ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని వినియోగదారుల పరిష్కార వేదిక చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి. సత్యనారాయణ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలోని అనకాపల్లి మండలం కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న 11 జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ పంపిణీలో ఎదురయ్యే సేవా లోపాలను సత్వరమే పరిష్కరించడానికి 2005లో పరిష్కార వేదికను ఏర్పాటు చేశారన్నారు.

2006 నుంచి ఇప్పటి వరకు 107 మంది వినియోగదారులకు రూ.14.26 లక్షల నష్ట పరిహారాన్ని అందజేశామన్నారు. వినియోగదారుల నుంచి 884 ఫిర్యాదులు అందగా, వాటిలో 60 ఫిర్యాదులు మాత్రం పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా 20 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు. వీటిని సాధ్యమైనంత తొందరలో పరిష్కరిస్తామన్నారు. డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ, సాంకేతిక సభ్యురాలు ఎస్. మసిలమణి, ఏవో మధు, ఏఈలు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ సత్యనారాయణ



పొలంలో గొర్రెలు, మేకల పెంపకం

తాటికమ్మే బంగారు పళ్లెం..

చారన్నమే విందు భోజనం

SUNDAY SPECIAL

- గొర్రెలు, మేకలతో ఆరు నెలల సంచారం
- నేల సారవంతం కోసం అన్నదాతల ఆదరణ
- తరతరాలుగా కొనసాగుతున్న మందకాపరుల వ్యవస్థ

పంటనిచ్చే నేలకు, అన్నం పెట్టే రైతన్నకు ప్రకృతి స్నేహితులు ఈ మందకాపరులు. ప్రపంచం ఆధునికత వైపు పరుగులు పెడుతుంటే మందకాపరుల జీవన శైలిలో ఏమాత్రం మార్పు రాలేదు. కుటుంబానికి తిండి గింజలు అందించేందుకు ఏడాదికి ఆరు మాసాలపాటు జిల్లాలు దాటి బయట ప్రాంతాల్లో సంచార జీవనం చేస్తారు. గొర్రెలు, మేకల మంద కొద్ది రోజులు పొలంలో ఉంటే వాటి మల మూత్రాల వల్ల సహజసిద్ధంగా నేల సారవంతమవుతుందని రైతులు వీరిని ఆదరిస్తుంటారు.



అన్నాన్ని తాటి బొల్లల్లో నింపుతున్న దృశ్యం

చీడికాడ: రైతులకు మేలు చేస్తూ అర్ధాకలితో మెలిగే మందకాపరుల జీవన శైలి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈకాలంలో కూడా ఇలాంటివి కొనసాగుతున్నాయా అనిపిస్తుంది. విశేషమేమిటంటే సంప్రదాయ సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరగడంతో ఈమధ్య కాలంలో మందకాపరులకు మరింత పని దొరికింది. ప్రతి ఏడాది విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం, విజయనగరం జిల్లాలోని ఎస్.కోట మండలాల్లోని పలు గ్రామాల నుంచి దమ్ములు సమయంలో గడిచిన 20 ఏళ్లుగా గొర్రెలు, మేకలతో పొలాల్లో మందలు కాసేందుకు 40 కుటుంబాల వారు వస్తుంటారు. వీరు ఈ రెండు జిల్లాల్లోని అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, సబ్బవరం, చోడవరం, మాడుగుల, చీడికాడ, వేపాడ, ఎస్.కోట, దేవరాపల్లి, కె.కోటపాడు తదితర మండలాలను దాటుకుంటూ మందలను తరలిస్తుంటారు. ప్రస్తుతం చీడికాడ మండలం నలుమూలలా మందలు కాస్తున్నారు. గొర్రెలు, మేకలు పొలంలో వేసే పేడ, మూత్రం వలన ఆయా పంట భూముల్లో మిథేన్ వాయువు విడుదలై నేల సారవంతంగా మారుతుందని రైతుల నమ్మకం. ఒక్కొక్క మందలో సుమారు 500 వందల నుంచి 600 వందల వరకు గొర్రెలు, మేకలు ఉంటాయి. 10 నుంచి 12 మంది కాపరులు ఉంటారు. వీరు పొలాల్లో మందలు కాసేందుకు రైతుల నుంచి రోజుకు మందను బట్టి 4 నుంచి 10 కుంచాల బియ్యం, రూ.600 నగదు తీసుకుంటారు. ఈ విధంగా రైతు ఎకరాకు మూడు నుంచి నాలుగు రోజులపాటు మందకాపు కాయిస్తుంటారు. వీరు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, తిరిగి రాత్రి 7 గంటలకే భోజనం చేస్తారు. మధ్యాహ్నం ఖాళీ కడుపుతోనే ఉంటారు. ఒక్కొక్క మంద వద్ద వీరిలో ఒకరు పొలం వద్దే ఉండి మిగిలిన వారికి వంట చేస్తూ.. కొత్తగా పుట్టిన గొర్రె, మేక పిల్లలకు కాపలాగా ఉంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తాటి చెట్లు ఎక్కి తాటి కమ్మలతో అన్నం తినేందుకు బొల్లలు తయారు చేస్తారు. అలా చెట్టెక్కి కమ్మ బొల్లలు కట్టే వారికి అదనంగా ఒక వాటా అన్నం, లేదా బియ్యం అందిస్తారు. పొలం గల రైతుకు ఒక బొల్లన్నం ఇస్తారు. చింతపండు చారుతోనే సొంతూరు వెళ్లే వరకు గడిపేస్తారు. వీరు తినగా మిగిలిన బియ్యాన్ని ఆయా గ్రామాల్లో నిల్వచేసి సొంతూరు వెళ్లేటప్పుడు తీసుకెళతారు. అలా ఏడాదిలో సగం రోజులు వీరు అర్ధాకలితో, చలి, చీకటిలో ప్రాణాలకు తెగించి కాపలా కాస్తూ, కుటుంబ పోషణకు అంకితమవుతారు. ఇలా వీరు మందలను గ్రామాలకు తీసుకొచ్చి నాటి నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లేనాటికి మరొక 100 నుంచి 150 పిల్లల వరకు పుడతాయని తెలిపారు.



మరో గ్రామానికి మకాం మార్చుతున్న మందల కాపరులు

రైతులతో విడదీయలేని అనుబంధం



పదేళ్లుగా ఈ ప్రాంతం వస్తుండంతో మాకు ఇవన్నీ సొంతూళ్లు అయిపోయాయి. మాతో రైతులందరూ బాగా ఉంటారు. ప్రతి రోజు ఒకరిని మా మంద వద్దకు మాతో భోజనానికి పిలుస్తాం. అలాగే వారు వస్తుంటారు. అదే మాకు పెద్ద సంతృప్తినిస్తుంది. -బుద్ధల ముసలినాయుడు, తిమ్మాపురం, భీమిలి మండలం

పిల్లలు వేరే వృత్తుల్లో..



మా తల్లిదండ్రులు మమ్మల్ని చదివించకుండా చిన్న నాటి నుంచి వారి వెంట మందలతో తీసుకెళ్లేవారు. ఈ చాలీచాలని బతుకులు మాతోనే అంతరించి పోవాలని మా పిల్లలకు వారసత్వంగా అందించదలుచుకోలేదు. అందువలనే వారు వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. -పల్లా అప్పన్న, వాయిలపాడు, ఎస్.కోట మండలం

అనకాపల్లి డీఎంహెచ్‌వోగా డాక్టర్ రవికుమార్



మహారాణిపేట (విశాఖ): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో)లను బదిలీ చేశారు. మరి కొంత మందిని పలు ఆస్పత్రుల్లో సీఎస్ఆర్ఎంవోలుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గజపతినగరం ఏరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ పి.రవికుమార్‌ను అనకాపల్లి జిల్లా డీఎంహెచ్‌వోగా నియమించారు. ఈ జిల్లాలోని కె.కోటపాడు సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌ను ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా నియమించారు. తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ యు.శ్రీహరిని కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా నియమించారు.

తాండవ రిజర్వాయర్ చైర్మన్‌గా సత్యనారాయణ



చైర్మన్ సత్యనారాయణకు ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఎలక్షన్ అధికారి స్వరూపరాణి

నర్సీపట్నం : తాండవ రిజర్వాయర్ చైర్మన్‌గా కరక సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండవ డీఈ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా నీటిపారుదలశాఖ డీఈ ఎ.ప్రేమ స్వరూప రాణి, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా డీఈ అనురాధ వ్యవహరించారు. తాండవ చైర్మన్‌గా కరక సత్యనారాయణను డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా అనిమిరెడ్డి జోగుబాబు ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

ఫార్మర్స్ రిజిస్ట్రీపై శిక్షణ


మాట్లాడుతున్న ఏడీఏ టి.శ్రీదేవి

నర్సీపట్నం : రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా అగ్రిస్టాక్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చిందని ఏడీఏ టి.శ్రీదేవి అన్నారు. ఫార్మర్స్ రిజిస్ట్రీలో రైతుల వివరాలను పొందుపర్చాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం ఇంచార్జీలకు ఫార్మర్స్ రిజిస్ట్రీ మీద శిక్షణ కార్యక్రమాన్ని ఏడీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. శిక్షణలో ఏడీఏ మాట్లాడుతూ రైతుల వివరాల నమోదు ద్వారా వచ్చే రైతు విశిష్ట సంఖ్యను సంక్షేమ పథకాలకు, నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ ధరలు రైతులకు అందజేయడానికి దోహదపడుతుందన్నారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ ద్వారానే నగదు బదిలీ జరుగుతుందన్నారు. అనంతరం రిజిస్ట్రీ విధానంపై జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ ఝాన్సీ అవగాహన కల్పించారు. రైతు ఆధార్, భూమి పాసుపుస్తకం, 1-బి, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబరు కచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత, ఐదు మండలాల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం ఇంఛార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో గోతులు పూడ్చండి..


రోలుగుంట వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

రోలుగుంట : రోలుగుంట పోలీసుస్టేషన్ దగ్గర నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు భారీగా గోతులు ఏర్పడడంతో నెల రోజుల వ్యవధిలో 9 మంది గాయాలపాలయ్యారని, జనం ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ రోడ్డు సమస్య గురించి స్థానిక ఎమ్మెల్యే శాసనసభలో ప్రస్తావించినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని ఆరోపించారు. రోడ్డు దుస్థితి వల్ల ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు కుదించివేశారని, స్కూలు విద్యార్థులు సమయానికి స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు గోవిందరావు తెలిపారు. ఆందోళనలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు డి.దేముడు నాయుడు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గేమిల వాసు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోరుతూ మానవహారం


నెహ్రూచౌక్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన నగదును కూటమి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జీవో నంబర్ 77ను రద్దు చేసి విద్యార్థులకు బకాయి పడ్డ నగదును తక్షణమే అందజేయాలన్నారు. ఫీజ్ రియింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏడాది విద్యార్థులకు సంబంధించి నాలుగు దఫాలుగా నగదు జమయ్యేదని, ప్రస్తుతం మూడు దఫాలుగా విద్యార్థులకు నగదు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ నేటికీ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్య అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హేమంత్, లత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గ్రామానికి ప్రతిష్ట


తగరంపూడి పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావును సత్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ సత్యవతి

అనకాపల్లి : మండలంలో తగరంపూడి పంచాయతికి పచ్చదనం-పరిశుభ్రతపై జాతీయ స్థాయి అవార్డు రావడం శుభపరిణామమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కమన్వకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తగరంపూడి పంచాయతి సర్పంచ్ యాదగిరి అప్పారావును శాలువాతో సత్కరించి, చిత్రపటాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడంలో తగరంపూడి పంచాయతీకి పచ్చదనం-పరిశుభ్రతపై జాతీయ స్థాయిలో మొదటి స్థానం రావడం గర్వించదగ్గ విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధికి అదనంగా రూ.కోటి నగదు అందజేస్తుందని, ఈ నగదుతో స్థానిక ప్రజలు సహకారంలో తగరంపూడి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ జిల్లాలో నక్కపల్లి, తగరంపూడి గ్రామాలకు రెండు జాతీయ స్థాయి అవార్డులు రావడం చిన్నవిషయం కాదన్నారు. దేశంలో 29 రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించడం గ్రామ ప్రజలు కృషి అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ అయితా రాము, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ పాల్గొన్నారు.

మృతుని వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వండి


రఘునాథరావు (ఫైల్)

చోడవరం రూరల్ : పట్టణ పరిధిలోని శివాలయం వీధిలోని ఓ ఇంట్లో శనివారం విగతజీవిగా లభ్యమైన జీతూరి రఘునాథరావు అనే వ్యక్తి పూర్తి వివరాలు తెలియరాలేదని, మృతుని వివరాలు తెలిసిన వారు చోడవరం పోలీసు కార్యాలయాన్ని సంప్రదించాలని సీఐ అప్పలరాజు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మృతుడు ఒంటరిగా శివాలయం వీధిలో నివాసం ఉండేవాడని, అతను గదిలో మృతి చెంది పడి ఉండడంపై స్థానికులు సమాచారం ఇవ్వడంతో విచారణ జరపగా అతడి వద్ద లభించిన ఓటరు ఐడీ ద్వారా జీతూరి వీరన్న కుమారుడు రఘునాథరావుగా గుర్తించినట్టు తెలిపారు. అంతకు మించి వివరాలు తెలియలేదన్నారు. మృతుని కుటుంబీకులు, లేదా పూర్తి సమాచారం తెలిసిన వారెవరైనా చోడవరం పోలీసు కార్యాలయం 94440796090, 08934245033 నంబర్లకు కాల్ చేసి తెలపాలని సీఐ కోరారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నయంత యూనివర్సిటీ సీఈఓ రంజన్ బెనర్జీ
- సెంచూరియన్‌లో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు
- విద్యార్థులకు డిగ్రీల ప్రదానం



సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న అతిథులు, మాట్లాడుతున్న నయంత యూనివర్సిటీ సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. ఉన్నత స్థాయికి వెళుతూనే ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినప్పుడే మంచి విజయాలు సాధించినవారమవుతామన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎస్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వ్యవధిలోనే దేశంలో అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ అవతరించిందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎస్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ తలపిస్తున్న ప్రభుత్వాల విధానాలు


మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు


సభలకు విచ్చేసిన పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా సీపీఎం జిల్లా మహాసభలు

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రకటిత ఎమర్జెన్సీ విధానాలు అవలంబిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. సీపీఎం పార్టీ 24వ జిల్లా మహాసభలు శనివారం నర్సీపట్నంలో ప్రారంభమయ్యాయి. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాలతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పాల్ ఘాట్ వరకు ప్రదర్శన కొనసాగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నర్సీపట్నం ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు అదానిలాంటి పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు చేయడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. అనంతరం జిల్లా కార్యదర్శి లోకనాథం, సీఐటీయు నాయకులు కోటేశ్వరరావు, రాజు, మహాసభల్లో ప్రసంగించారు.

ఆయుష్మాన్ కేంద్రాల్లో నాణ్యమైన సేవలందాలి

- పాటిపల్లి కేంద్రంలో ఢిల్లీ బృందం తనిఖీ


పాటిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం

మునగపాక : పాటిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను శనివారం ఢిల్లీ బృందం సందర్శించింది. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) టీమ్‌కు చెందిన డాక్టర్ గణేష్ నాగిరెడ్డి అదికి, రేజ్ కుమార్‌లు మునగపాక ఉపకేంద్రమైన పాటిపల్లిలో సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కేంద్రం ద్వారా సేవల్లో నాణ్యతను నిర్ధారించడం అలాగే మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ సంస్థ పనిచేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ జాతీయ కార్యక్రమాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా పలు కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను గుర్తించేందుకు తమ బృందం పర్యటిస్తుందని వారు తెలిపారు. ఆసుపత్రిలో ఏఎన్ఎం సుజాత అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ మణికంఠ, డాక్టర్ దుర్గా ప్రవళిక, సీహెచ్‌వో దేవకాంత, ఆశ కార్యకర్తలు సీహెచ్ భవాని, వెంకటలక్ష్మి, అప్పలనర్స, హెచ్‌వీ లక్ష్మి పాల్గొన్నారు.

నమ్మించి మోసగించారు

- వైస్ ఛైర్మన్ పేరుమార్పుపై దిబ్బపాలెం ఎంపీటీసీ పెద్దినాయుడు, మార్లగుమ్మి చానల్ అధ్యక్షుడు మండిలు ఆవేదన


ఎన్నిక ప్రక్రియ నుంచి వెళ్లిపోతున్న పెద్దినాయుడు,మండిలు

చీడికాడ : రాత్రికి రాత్రి ఉపాధ్యక్షుని పేరుమార్చి ఇప్పటివరకు ఎప్పుడూ ప్రస్తావనకు రాని పేరు ప్రకటించారంటూ మండలంలోని దిబ్బపాలెం ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, దిబ్బపాలెం మార్లగుమ్మిఛానల్ అధ్యక్షుడు దారపు మండిలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో సమావేశ మందిరంలో కోనాం జలాశయం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఆర్‌డీఓతో పాటు ఇరిగేషన్ అధికారులు, నూతనంగా ఎన్నికైన నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఆర్‌డీఓ చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లను ప్రకటించి నియామక పత్రాలు అందించారు. దీంతో అక్కడే ఉన్న పెద్దినాయుడు మాట్లాడుతూ వైస్ చైర్మన్‌గా దారపు మండీలు పేరు కాకుండా కొట్యాడ చిన్నంనాయుడును ఎలా నియమించారని అక్కడే ఉన్న నాయకులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు చిన్నంనాయుడు పేరు ఎవరూ ప్రస్తావించలేదని రాత్రికి,రాత్రి సంతకాలు చేసి మమల్ని మోసగించి మండలపార్టీ నేతలు, ఎమ్మెల్యే కలిసి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నేతలు వీరిని సముదాయించేందుకు ప్రయత్నించినా వారు ఆగ్రహంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.


జీవితంలో ధ్యానం భాగం కావాలి

- పాఠశాలల్లో యోగ ధ్యాన తరగతులు పెట్టేలా కృషి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు


జ్యోతి వెలిగించి ధ్యాన సదస్సును ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : ధ్యానం ప్రతి మనిషి జీవితంలో భాగం కావాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణమండపంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పీకర్ సతీమణి పద్మావతితో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దినోత్సవం కేవలం డిసెంబర్ 21నే కాకుండా ప్రతి రోజు ధ్యానం మన జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి రోజు ఉదయం కనీసం 15 నిమిషాలు ధ్యానం చేస్తే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ధ్యాన కేంద్రాల్లో నేర్చుకున్న ప్రక్రియలను ఇంట్లో అమలు చేయాలన్నారు. ధ్యానం విశిష్టతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు పాఠశాలల్లో యోగ ధ్యాన తరగతులు పెట్టేలా కృషి చేస్తానన్నారు. పిల్లలకు చిన్న వయస్సు నుండే ధ్యానం ,యోగ అలవాటు చేయాలన్నారు. వచ్చే ఏడాది ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మరింత భారీగా నిర్వహించేందుకు కృషి చేస్తానని స్పీకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకల రమణమ్మ, రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ జెడ్పీ లక్ష్మయ్య, అంకిత సత్యనారాయణ, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, మెడికల్ షాప్స్ యూనియన్ అధ్యక్షుడు కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు


గంజాయితో పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ రాజారావు, సిబ్బంది

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజారావు అందించిన వివరాల ప్రకారం, సీఐ ఎల్.రేవతమ్మకు వచ్చిన ముందుస్తు సమాచారం మేరకు నెంబరు లేకుండా స్కూటీపై గంజాయితో వస్తున్న ముగ్గురు యువకులను గురందరపాలెం గ్రామ శివారులో పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నర్సీపట్నంకు చెందిన గొర్లి లక్ష్మీపాత్రుడు (21), మహారాష్ట్రకు చెందిన జోకిమ్ బలస్వారీ డిసోజ (38), కర్నూల్ జిల్లా, పత్తికొండ గ్రామం మద్దూరి రామ్ చరణ్ (20)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఇరువర్గాల వివాదంలో ఇద్దరు అరెస్టు

చోడవరం రూరల్: మండలంలోని రామజోగిపాలెం గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య సాగుతున్న పరస్పర దాడులకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. గ్రామానికి చెందిన కిల్లి రాము, లెక్కల గోవింద్‌ల కుటుంబాలు గత కొంత కాలంగా భూతగాదాలు పడుతున్నారు. ఈ మేరకు వీరిపై గతంలో కేసులు సైతం నమోదు చేశారు. కాగా తాజాగా ఈ నెల 16న రెండు కుటుంబాల వారు భూమి విషయమై గొడవకు దిగి ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడులకు దిగి హత్యా యత్నాలకు పాల్పడి, పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి రాము, గోవింద్‌లను అరెస్టు చేసి శనివారసం చోడవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

అధికారులు రాని సమావేశాలెందుకు ?


మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి రూరల్ : అధికారులంతా గ్రామాల్లో ప్రజలతో ఎన్నుకోబడిన వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు,ఎంపీటీసీలకు ప్రాధాన్యమివ్వకుండా అధికారపార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని ఎంపీపీ బోదెపు గోవింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమావేశానికి అధికారుల్లో ప్రాధాన్యం గల రెవెన్యూ, కొన్ని శాఖల అధికారులు హాజరుకావడం లేదు. ఇలా అయితే సమావేశాలెందుకు అంటూ ఆయన శనివారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్‌లో జరిగిన మండల సమావేశంలో ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారన్నారు. మండల కో ఆప్షన్ సభ్యుడు సిద్ధా నూకేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో రైతు భరోసా కేంద్రం నిర్మించినపుడు నీటిని తోడేందుకు ఉపయోగించిన మోటారు, పైపులను పనులు చేపట్టిన కాంట్రాక్టరు అక్రమంగా తీసుకుపోయారన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడంలేదని నిలదీశారు. రేగుపాలెం సర్పంచ్ మహాలక్ష్మి మాట్లాడుతూ గోకులం షెడ్ల మంజూరులో నిబంధనలు పాటించలేదన్నారు. ఇటీవల అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించారు.

క్లుప్తంగా

ఎంఈవో-1 దృష్టికి విద్యా సమస్యలు



ఎంఈవో-1 దివాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

తుమ్మపాల: మండల విద్యాశాఖ అధికారి-1గా నియమితులైన ఎం.దివాకర్‌ను యూటీఎఫ్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరికి సుపరిచితులు, సేవాతాత్పరులైన దివాకర్ మండల అధికారిగా రావడం సంతోషకరమని జిల్లా సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు తెలిపారు. మండలంలో విద్యా సమస్యలను సత్వరమే ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, మండల అధ్యక్షుడు మామిడి బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్, మండల నాయకులు బండారు రవీంద్ర పాత్రుడు, రెడ్డి అర్జున్, కిషోర్, డేవిడ్‌రాజు, సన్యాసినాయుడు, కృష్ణకిషోర్, నిరోషా పాల్గొన్నారు.

రామానుజన్‌కు ఘన నివాళి



విద్యార్థుల గణిత నృత్య రూపకం ప్రదర్శన

కశింకోట: తాళ్లపాలెంలో గాయత్రి స్కూలులో ముందస్తుగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గణిత నృత్య రూపకం, గణిత వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్‌ఎం వై. నగేష్, కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్, గణిత ఉపాధ్యాయులు ఎం. ధనుంజయరావు, పి. కళాయిసెల్వి, యాజమాన్య సభ్యుడు ఐ. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి శివారులో కోడి పందాలు ఆడుతుండగా ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురు నిందితుల్ని పట్టుకున్నామని ఎస్‌ఐ మనోజ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రూ.5650, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 361 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,800
మొదటి రకం	3,800	4.180
రెండో రకం	3,190	3,700
మూడోరకం	3,000	3,150

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	:	పర్తిసాయి
బచ్చల మల్లి	:	షిర్డీసాయి
జీబ్రా	:	వెంకటేశ్వర
అమరన్	:	శ్రీసత్య
పుష్ప-2	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



అనకాపల్లి: నెహ్రూచౌక్‌లో అన్నసమారాధన ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్



అనకాపల్లి: అన్నసమారాధనలో ప్రజలు



అనకాపల్లి: సత్యనారాయణపురం ప్రభుత్వ పాఠశాలకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్



అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్, బొడ్డేడ శివ, కె.ఎం.నాయుడు

జనహృదయ నేత జగన్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల **భరత్‌కుమార్**
- వాడవాడలా మాజీ సీఎం **జగన్‌మోహన్** రెడ్డి జన్మదిన వేడుకలు
- విద్యుత్ చార్జీలు తగ్గించాలని 27న కలెక్టరేట్ వద్ద నిరసన



కశింకోట: తాళ్లపాలెంలో ఉపాధి కూలీల మధ్య కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకుడు లగిశెట్టి గణేష్



కశింకోట పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయడంతోపాటు సంక్షేమ పథకాల రథసారథిగా పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి, భరత్‌కుమార్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ గత పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు నేత్రాలుగా పాలన సాగిందన్నారు. కూటమి పాలనలో నేటికీ ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. నియోజకవర్గంలో వాడవాడలా జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారంటే ఆయనపై ఎంత అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. ఈ నెల 27న పార్టీ అధినేత పిలుపు మేరకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. మాజీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ రెండున్నరేళ్ల ప్రపంచం కరోనా మహమ్మారితో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వానికి ఆదాయం లేకపోయినప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో నేటికీ వారు మర్చిపోలేకపోతున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వర్మీకంపోస్టు యార్డులు, ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తీసుకురావడంతో నేటికీ చెప్పుకుంటున్నారన్నారు. నేటి పాలనలో జగనన్న సంక్షేమ పథకాల గురించి ప్రజలు ఆలోచనలో పడ్డారని, రానున్న రోజుల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని వాటిని అందుకోవాలని ఆశతో ఉన్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నుంచి పుట్టిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు చేసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రజలను మోసం చేసే నాయకున్ని కూటమి పాలనలో ప్రజలు చూస్తున్నట్లు విమర్శించారు. వైఎస్సార్‌సీపీలో లబ్ధి పొంది ఇతర పార్టీలకు వెళ్లిపోవడంతో నష్టమేమి లేదన్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉన్న నాయకులు జగన్‌కు అండగా ఉన్నారన్నారు. అనంతరం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, 80వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కుండల రామకృష్ణ, గైపూర్ రాజు, దాడి నారాయణరావు, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు సేవా కార్యక్రమాలు...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోని నెహ్రూచౌక్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం-2 అధ్యక్షుడు వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో వెయ్యి మంది నిరుపేదలకు అన్నసమారాధన కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు.



కశింకోట: తాళ్లపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల నిర్వహణ



కశింకోట: ఉగ్గినపాలెంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

● సత్యనారాయణపురంలో...

సత్యనారాయణపురం పంచాయతీలో ఎంపీటీసీ జోగా నాగమణి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ల్యాప్‌ట్యాప్ అందజేశారు. గ్రామ సర్పంచ్ పలక సత్తిబాబు, మూలపేట ఎంపీటీసీ కర్రిమజ్జి అలివేణి, వార్డు మెంబర్లు రావి కిషోర్, పి.అప్పలరాజు, ఎం.సతీష్, పి.రాజు, జోగా సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డు అగ్గిమర్రిచెట్టు, ఎన్టీఆర్ ఆస్పత్రిలో...

స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు మలసాల భరత్‌కుమార్ పంచిపెట్టారు. గవర పాలెం అగ్గి మర్రిచెట్టు వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ నాయకులు దాడి నారాయణరావు, నడిశెట్టి మధు, మున్నూరు శ్రీను, శ్రీధరాల మనోజ్, వి.వి. సతీష్, కొణతాల గోవింద్, రాయవరపు జోగిరాజు, మద్దాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, పండూరి ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఉగ్గినపాలెంలో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం పార్టీ కార్యాలయంలో ఉపాధి కూలీల మధ్య జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కేకు కట్ చేశారు. అక్కడి పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి శ్రీను, యువ నాయకుడు మందపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య

జిల్లా వ్యవసాయ అధికారి బమ్మిడి మోహన్‌రావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహనరావు

తుమ్మపాల: వ్యవసాయ రంగం డిజిటలీకరణలో భాగంగా రైతులకు ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బమ్మిడి మోహన్‌రావు అన్నారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా రైతులు తాము పండించిన పంటలను కనీస మద్దతు ధరకు అమ్ముకోవడానికి కిసాన్స్ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఉన్న డేటా వ్యవసాయ భూములు, పంట వివరాలకే పరిమితమైందని, రైతుల వారీగా సమాచారం లేదన్నారు. కొత్త రిజిస్ట్రీ ద్వారా ఈ అంతరాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విద్యావంతులైన రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సంస్థలు ఈ నమోదు ప్రక్రియ గురించి రైతులకు అవగాహన కల్పించాలని, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కోరారు. రిజిస్ట్రేషన్ డ్రైవ్ కోసం దేశవ్యాప్తంగా క్యాంపులు నిర్వహించనున్నారు. వ్యవసాయ రంగానికి కిసాన్ ఏఐ చాట్‌బాక్స్ వ్యవస్థ సహా పలు సాంకేతికతలను జోడించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అధికారులు వెల్లడించారు. డిజిటల్ సేవల మెరుగుదలకు రైతుల మద్దతు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, వ్యవసాయ భూసంరక్షణ అధికారి మురళి, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో పారిశుధ్య పనులు



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి వారం చేపట్టే కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో చెత్తా చెదారాలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సత్యారావు తదితరులు పర్యవేక్షించారు.

పెండింగ్ సివిల్ కేసుల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో ప్రత్యేకాధికారి లక్ష్మీసుభాషిణి, తదితరులు

కశింకోట: మండలంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని మండల స్థాయి సమన్వయ కమిటీ నిర్ణయించింది. సివిల్ కేసుల పరిష్కారానికి కొత్తగా ఏర్పాటైన మండల సమన్వయ కమిటీ సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. జిల్లా ట్రెజరీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మి సుభాషిణి అధ్యక్షత వహించిన సమావేశంలో అవకాశం ఉన్న మేరకు భూ వివాదాలు, ఇతర సివిల్ కేసులను పరిష్కరించాలని నిర్ణయించారు. ప్రతి శనివారం ఉదయం 10 గంటలకు సివిల్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపడతారని కమిటీ పేర్కొంది. కమిటీలో ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

ప్రకటనలు, ఆఫర్లపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

పరవాడ: ప్రకటనలు, ఆఫర్లపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకుని కన్స్యూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో 'వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అన్న అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రసీదు తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే ముందు వినియోగదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కార మార్గాలు, హాల్‌మార్క్ బంగారు ఆభరణాల స్వచ్ఛత, తూనికల్లో తేడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనైతిక వ్యాపారాలు, తప్పుతోవ పట్టించే ప్రకటనలను అరికట్టడానికి వినియోగదారుల చట్టం ప్రకారం ప్రభుత్వం మూడేళ్ల నిషేధం విధిస్తుందని వెంకటరమణ తెలిపారు.

విద్యాసంస్థల్లో సదస్సులు

సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థల్లో వినియోగదారుల హక్కుల రక్షణపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. హెచ్‌ఎం విక్టోరియారాణి, తదితరులు పాల్గొన్నారు.

భూముల మార్కెట్ విలువ తగ్గించాలని వినతి

తుమ్మపాల: భూముల మార్కెట్ విలువ పెంపుపై గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు నిర్ణయం తీసుకోవాలని మండలంలో రేబాక గ్రామానికి చెందిన రైతులు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా పెంచుతున్న మార్కెట్ విలువతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్, సబ్బవరం సబ్ రిజిస్ట్రార్‌కు శనివారం వారు వినతిపత్రం అందించారు. గత ఏడాది-2023లో ఇప్పటి మార్కెట్ ధరపై ప్రభుత్వం నిబంధనల ప్రకారం అత్యధికంగా 20 శాతం పెంచాల్సిన మార్కెట్ విలువను అప్పటి అధికారులు ఏకంగా 85 శాతం పెంచేసి భూములు అమ్ముకోకుండా చేశారని వాపోయారు. దీంతో ఏడాది కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రోడ్డు ఆనుకున్న భూముల మార్కెట్ విలువకు సమానంగా పొలాలు, వ్యవసాయ భూములకు పెంచడం అన్యాయమన్నారు. రెవెన్యూ, సర్వే, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ భూముల మార్కెట్ విలువ తగ్గించాలన్నారు. రానున్న జనవరి నుంచి మరలా పెంచుతున్న భూముల మార్కెట్ విలువ నుంచి తమ గ్రామాన్ని మినహాయించాలని కోరారు.

వసంతోత్సవ పూజలు



ధ్యాన మందిరంలో స్వామివార్లకు పూజలు

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శనివారం రాత్రి వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలు, చెరకు రసం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

అనకాపల్లి: పట్టణంలోని పూడిమడక జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగతనానికి గురైన వాహనాన్ని గుర్తించి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. అనకాపల్లి మండలం శారదానగర్‌కు చెందిన పలకా సంజీవ్‌కు చెందిన ద్విచక్ర వాహనం ఈ నెల 13న చోరీకి గురైంది. ఈ మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పూడిమడక రోడ్డులోని జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తుండగా ఆ వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. నిందితుడు సాహిబ్‌బాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న ధ్యాన శిక్షకురాలు తులసి

సబ్బవరం: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ఉరుకులు, పరుగులతో జీవితం గడుపుతున్నారన్నారు. ఆధ్యాత్మిక చింతనకు ధ్యానం ఒక మార్గమని, ధ్యానం చేయడం ద్వారా శారీరకమైన మార్పులతో కూడిన మానసిక రుగ్మతలు పోతాయని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. విద్యార్థి దశ నుంచి క్రమం తప్పకుండా ధ్యానం, యోగాలను క్రమం తప్పకుండా ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అశోక్, వై.టి.రాజేష్, ఎం.వి.రామకృష్ణ, లక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి ధ్యానమే ఔషధం

పెందుర్తి: విద్యార్థి దశలో ఒత్తిడిని అధిగమిస్తేనే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ధ్యాన శిక్షకురాలు శరగడం తులసివరలక్ష్మి అన్నారు. ఒత్తిడి(స్ట్రెస్) నివారణకు ధ్యాన సాధన ఒక్కటే మందు అని చెప్పారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా స్థానిక అమృత ఫిజియోథెరపీ విద్యా సంస్థలో ధ్యానంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న విద్యార్థుల చదువు/శిక్షణకు నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుందన్నారు. రోజూ నిర్ణీత సమయంలో ధ్యాన సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మేధాశక్తిని సాన పట్టినట్టు అవుతుందన్నారు. ధ్యాన సాధన చేస్తూ మాంసాహారాన్ని త్యజిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని సూచించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యా సంస్థ డైరెక్టర్ నందూరి లక్ష్మి నరసింహం, ప్రిన్సిపాల్ నర్సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి బహుమతి



చత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయశర్మ నుంచి బహుమతి అందుకుంటున్న బంగార్రాజు

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి జాతీయ స్థాయి బహుమతి లభించింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఆలిండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో శంకర్ ఫౌండేషన్ నెలవారీ న్యూస్‌లెటర్ విజనరీ ఇన్‌సైట్స్‌కు ద్వితీయ బహుమతి లభించింది. దీనిని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయశర్మ నుంచి శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు (పీఆర్ అండ్ లైజన్) అందుకున్నారు. సదస్సులో పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి, రాయ్‌పూర్ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ షాహిద్ అలీ పాల్గొన్నారు. శంకర్ ఫౌండేషన్ జీఎం కె.రాధాకృష్ణన్, డీజీఎం వి.రమేశ్‌కుమార్ బంగార్రాజును అభినందించారు.